సాక్షి
మంచిర్యాల
శనివారం । 27 । జనవరి । 2024


నందిని నృత్యాలయం విద్యార్థుల నృత్య ప్రదర్శన

అన్నింటా అభివృద్ధి

- ప్రజా సంక్షేమానికి పథకాల అమలు
- కలెక్టర్ బదావత్ సంతోష్
- ఘనంగా 75వ గణతంత్ర వేడుకలు


ప్రసంగిస్తున్న కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: అన్నింటా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రజా సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో 75వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కలెక్టర్ సంతోష్ వివరించారు. ఆయన మాటల్లోనే.. సమాజంలో అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే కార్యాచరణలో భాగంగా ఆరు గ్యారంటీల్లో రెండింటిని ఇప్పటికే అమలు చేసింది. మహాలక్ష్మి పథకంలో మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణంలో జిల్లాలో ఇప్పటివరకు 13,62,176 మంది లబ్ధి పొందారు. రూ.500కే రాయితీ సిలిండర్‌తోపాటు మహిళలకు ప్రతీనెల రూ.2,500 అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.5లక్షలను రూ.10లక్షలకు పెంచడం ద్వారా నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అమల్లోకి వచ్చాయి. గత డిసెంబర్ 28నుంచి జనవరి 6వరకు ప్రజాపాలన కార్యక్రమంలో 2,58,213 దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. గృహజ్యోతి పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు చర్యలు తీసుకుంటున్నాం. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులకు రూ.5 లక్షలు ఆర్థికసాయం అందించేందుకు త్వరలోనే కార్యాచరణ విడుదలకు ప్రభుత్వం నిర్ణయించింది.

వ్యవసాయ రంగం

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తూ రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోంది. రైతుబంధు పథకం కింద ఈ యాసంగి సీజన్‌లో 95,628మందికి రూ.48 కోట్లు జమ చేసింది. జిల్లాలో 95,884 మంది రైతులను రైతుబీమా ప్రయోజనం కింద చేర్చి 40 మందికి రూ.5 లక్షల చొప్పున, రూ.2 కోట్లు చెల్లించాం.

ఉద్యానవనం


జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్, డీసీపీ సుధీర్‌రాంనాథ్

2023-24 సంవత్సరానికి గాను 3,500 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ తోటలు పెంచడం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2,227 ఎకరాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి 1,082 ఎకరాలకు అనుమతి పొందాం.

పౌరసరఫరాల

జిల్లాలో 2.20లక్షల మంది కార్డుదారులకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నాం. వసతిగృహాలు, అంగన్‌వాడీల్లో మధ్యాహ్న భోజనం పథకానికి బియ్యం పంపిణీ చేస్తున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరతో 15,361 మంది రైతుల నుంచి లక్షా 39 వేల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.223 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశాం.

నీటి పారుదల

కడెం ఆయకట్టు, గూడెం ఎత్తిపోతల పథకాల ద్వారా చెరువుల కింద సాగునీరు అందిస్తాం. దండేపల్లి మండలం తానిమడుగు గ్రామం వద్ద 30వ డిస్ట్రిబ్యూటర్ కెనాల్ నుంచి హాజీపూర్ 42వ డిస్ట్రిబ్యూటర్ కాలువ వరకు, యాసంగి పంటల సాగు కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గూడెం ఎత్తిపోతల ద్వారా దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో దాదాపు 15వేల ఎకరాల ఆయకట్టుకు దశలవారీగా సాగునీరు అందిస్తాం.

గ్రామీణ అభివృద్ధి

జిల్లాలో 10,162 స్వయం సహాయక సంఘాల్లో లక్షా 15 వేల మంది సభ్యులు ఉండగా, బ్యాంక్ లింకేజీ ద్వారా 3,990 సంఘాలకు రూ.276 కోట్లు మంజూరు చేశాం. ఉపాధి హామీ పథకంలో లక్షా 21 వేల మందికి జాబ్‌కార్డులు అందించి 100 రోజుల పని కల్పించి వేతనాలు చెల్లించాం.

పురపాలక సంఘాలు

జిల్లాలోని ఏడు మున్సిపాల్టీల్లో రూ.కోట్లతో పెద్దయెత్తున అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. సమీకృత కూరగాయల మార్కెట్లు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డ్‌లు, ప్లే గ్రౌండ్లు, చిల్డ్రన్ పార్కులు, మురుగు కాలువలు, మహిళా భవనాలు, ఓపెన్ జిమ్‌లు, అంతర్గత రోడ్లు, వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్, పబ్లిక్ టాయిలెట్స్, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం. వేసవి నీటి ఎద్దడి నివారణకు జనవరి 14 నుంచి మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల్లో ప్రతీరోజు 2 గంటలు తాగునీటి సరఫరా ప్రారంభించాం.


భీమారంలో జాతీయ జెండాతో చిన్నారి

పరిశ్రమలు

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే విధంగా టీఎస్ ఐ-పాస్ ద్వారా 2023-24 సంవత్సరానికి 53 యూనిట్లు, 108 అనుమతుల కోసం దరఖాస్తులు రాగా, 83 అనుమతులు వివిధ శాఖల ద్వారా మంజూరు చేశాం. 32 పరిశ్రమలు రూ.20 కోట్లు పెట్టుబడితో స్థాపించడం ద్వారా 285 మందికి ఉపాధి కల్పించాం. టీ-ఐడియా, టీ- ప్రైడ్ పథకాల ద్వారా 65 దరఖాస్తులకు రూ.257 లక్షలు రాయితీ మంజూరు చేశాం.


పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, డీసీపీ, అదనపు కలెక్టర్లు

విద్యుత్

జిల్లాలో వివిధ కేటగిరీల కింద 3.45 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, 2023-24 సంవత్సరంలో జిల్లాకు 909 మెగావాట్ల యూనిట్లు కేటాయించగా, 688 మెగావాట్ల యూనిట్ల విద్యుత్ వినియోగించడం జరిగింది. జిల్లాలో టీఎస్ ఐపాస్ ద్వారా 516 పరిశ్రమల దరఖాస్తులు రిజిష్టర్ కాగా 275 దరఖాస్తులు పరిష్కరించి 30 రోజుల్లో కనెక్షన్లు మంజూరు చేశాం. విద్యుత్‌రంగం బలోపేతం చేసే దిశగా పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చాం.

రహదారులు – భవనాలు

జిల్లాలో 635 కిలోమీటర్ల నిడివి గల రహదారులు విస్తరించి ఉన్నాయి. ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించే ఉద్దేశ్యంతో 165 పనుల ద్వారా రూ.1.355 కోట్లతో 512 కిలోమీటర్ల రహదారులు, 67 వంతెనలు, 3 ఆర్‌ఓబీల నిర్మాణం మంజూరైంది. 70 శాతం పనులు పూర్తి కాగా, 30 శాతం పనులు పురోగతిలో ఉన్నాయి. చెన్నూర్‌లో కోర్టు భవనం, న్యాయమూర్తి నివాస భవనం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రూ.205 కోట్లతో వైద్య కళాశాల, మరో రూ.205 కోట్లతో మాతాశిశు ఆసుపత్రి నిర్మాణ పనులు చేపట్టనున్నాం.


స్టాల్స్‌లో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ బి.సంతోష్

విద్యారంగం

జిల్లాలో 1,078 పాఠశాలలు, 2,361 మంది ఉపాధ్యాయుల ద్వారా లక్షా 24 వేల మంది విద్యార్థులకు బోధన జరుగుతోంది. 5 ఆదర్శ పాఠశాలల్లో 3,230 మంది అభ్యసిస్తున్నారు. 18 కేజీబీవీల్లో 4,500 మంది విద్యార్థినులు చదువుతున్నారు. 2వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు 88,281 పార్ట్-2 పాఠ్య పుస్తకాలు, 10వ తరగతి విద్యార్థులకు 24,401 అభ్యాస దీపికలు పంపిణీ చేశాం.

వైద్యం–ఆరోగ్యం

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 4,542 ప్రసవాలు జరుగగా, ఇందులో 2,241 సాధారణ కాన్పులు, 2,301 సిజేరియన్లు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 3,613 ప్రసవాలు జరుగగా, 454 సాధారణ కాన్పులు, 3,159 సిజేరియన్లు జరిగాయి. 'సిజేరియన్లు వద్దు -సాధారణ ప్రసవాలు ముద్దు' అనే నినాదంతో అవగాహన కల్పించాం. 3,737 మంది గర్భిణులకు మాతాశిశు సంరక్షణ కిట్లు అందించాం. డయాగ్నోస్టిక్స్ ద్వారా 25,300 మంది రోగులకు, బెల్లంపల్లి ఆస్పత్రిలో 2,923 మంది రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నాం.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, శకటాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శకటాల ప్రదర్శించిన వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ సంతోష్ ప్రశంసాపత్రాలు అందజేశారు. పోలీస్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేత 13 బిటాలియన్ పోలీసు జట్టు, రన్నర్‌గా నిలిచి బెల్లంపల్లి రిజర్వ్‌డ్ పోలీసు జట్టుకు కప్‌లు అందజేశారు.

పోడు భూములు–పట్టాలు

2023-24లో జిల్లాలో పోడు సాగు చేసుకుంటున్న 2,403 మంది రైతులను గుర్తించి 5,024 ఎకరాల భూమికి పట్టాలు దశల వారీగా అందించాం. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బీ.రాహుల్, మోతిలాల్, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


టీఎస్ఎస్ మోడల్ స్కూల్ విద్యార్థుల నృత్యప్రదర్శన


జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు


వైద్య ఆరోగ్య శాఖ శకటం



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులు


విజేత పోలీస్ జట్టుకు కప్ అందజేస్తున్న కలెక్టర్


రన్నర్ జట్టుకు బహుమతి అందిస్తున్న కలెక్టర్



పాఠశాల విద్యార్థుల నృత్యప్రదర్శనలు

న్యూస్‌రీల్

సేవలకు దక్కిన గౌరవం

- సీఎఫ్‌ఓ శాంతారామ్
- అటవీశాఖలో నగదు అవార్డుల ప్రదానం


ప్రశంసాపత్రాలు అందుకున్న వారితో సీఎఫ్‌ఓ

మంచిర్యాలక్రైం: జిల్లా అటవీ శాఖ అధికారుల సేవలకు గౌరవం దక్కిందని, కష్టపడి, నిస్వార్థంగా సేవలందించిన వారికి ఎప్పటికైనా ఫలితం దక్కుతుందని సీఎఫ్‌ఓ శాంతారామ్ అన్నారు. మంచిర్యాలలో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అటవీ సంరక్షణలో నైపుణ్యాన్ని ప్రదర్శించిన అధికారులకు నగదు బహుమతి, ఉత్తమ సేవ ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం అయన మాట్లాడుతూ అటవీ శాఖ సంరక్షణలో అలుపెరగని సేవలందించిన అధికారులను కొనియాడారు. సమష్టిగా పని చేయాలని సూచించారు. అవార్డు అందుకున్న వారిలో బెల్లంపల్లి ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓ ఏ.సుభాష్, జన్నారం ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌వో ఎండీ.హఫీజోద్దీన్, మందమర్రి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పీ.సంతోష్, కిష్టంపేట ఎఫ్‌బీఓ ఈ.రాజేందర్‌కు ప్రశంసాపత్రంతోపాటు రూ.10వేల నగదు అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ వినయ్‌కుమార్ సాహు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు లహరి బస్సు సౌకర్యం


ఆర్‌వోబీ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్: చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల ప్రజలకు లహరి స్లీపర్ బస్సు సౌకర్యంగా ఉంటుందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్‌కు లహరి బస్సు సర్వీసును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను గుర్తించి బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గొడిసెల బాపురెడ్డి, తగరం వెంకటి, హిమవంతరెడ్డి, పిట్టల రవి పాల్గొన్నారు.

ముంపు భూముల పరిశీలన

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల గ్రామ సమీపంలో ఉన్న అన్నారం బ్యారేజీ వరదతో ముంపునకు గురవుతున్న భూములను ఎమ్మెల్యే వివేక్ శుక్రవారం పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ అధికారులతో రైతుల సమక్షంలో కరకట్ట నిర్మాణం కోసం సమీక్షించారు. గత నాలుగేళ్లుగా అన్నారం బ్యారేజీ వరద, కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో జరిగిన పంట నష్టంపై బాధిత రైతులు వివరించారు.


క్యాతనపల్లిలో మార్నింగ్ వాక్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే వివేక్ శుక్రవారం మార్నింగ్ నిర్వహించారు. గద్దెరాగిడి, సాయికుటీర్, బీజోన్ ప్రాంతాల్లో డ్రైనేజీలు పరిశీలించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిని పరిశీలించి భూనిర్వాసితులకు రెండు మూడు రోజుల్లో పరిహారం అందించాలని అధికారులను ఆదేశించారు. బ్రిడ్జి నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, నాయకులు రఘునాథ్‌రెడ్డి, అబ్దుల్‌అజీజ్ పాల్గొన్నారు.

పెద్దపల్లి ఎంపీ స్థానంపై బీఆర్‌ఎస్ జెండానే..

- ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి
- నియోజకవర్గాల వారీగా సమావేశాలు
- బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

నస్పూర్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెండు సార్లు జరిగిన ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ స్థానాన్ని బీఆర్‌ఎస్ కై వసం చేసుకుందని, త్వరలో జరిగే ఎన్నికల్లోనూ ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. శుక్రవారం ఆయన నస్పూర్ పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకం ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో సుమన్ మాట్లాడుతూ త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఈ నెల 30న బెల్లంపల్లి, ఫిబ్రవరి 4న చెన్నూర్, 5న మంచిర్యాల నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ఒత్తిడి తెస్తామని అన్నారు. ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

వివేక్ ఇచ్చిన హామీ మేరకు చెన్నూర్ నియోజకవర్గంలో 45వేల మందికి ఉద్యోగాలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, మండలానికో స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్, ఫ్యాక్టరీలు నిర్మించాలని కోరారు. రైతుబంధు డబ్బులు ఇంకా ఎందుకు జమ చేయలేదని ప్రశ్నించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్య జనగణమనతో ప్రజల్లో దేశభక్తి

బెల్లంపల్లి: రోజువారీగా జనగణమన గీతాలాపన వల్ల ప్రజల్లో దేశభక్తి పెంపొందుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి కాంటా చౌరస్తా వద్ద జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తి, ఐకమత్యానికి నిత్య జనగణమన ఉపయోగ పడుతుందని తెలిపారు. జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడేపు సతీష్ మాట్లాడుతూ ప్రతీరోజు ఉదయం 8గంటలకు పట్టణంలోని మూడు ప్రధాన కూడళ్లలో మైకుల ద్వారా జాతీయ గీతం వస్తుందని, ఆ సమయంలో ప్రజలు ఎక్కడికక్కడే నిలబడి వందనం చేసి దేశభక్తిని చాటుకోవాలని కోరారు.

వంద మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు వంద మీటర్ల జాతీయ పతాకాన్ని పుర వీధుల్లో ప్రదర్శించారు. పాత బస్టాండ్ వద్ద నుంచి బజారు ఏరియా పుర వీధుల మీదుగా కాంటా చౌరస్తా వరకు త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. మున్సిపల్ కమిషనర్ జక్కుల శ్వేత, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ నాయకులు మునిమంద రమేష్, మల్లయ్య, బత్తుల రవి, దావా రమేష్ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే

మున్సిపాలిటీల సుందరీకరణకు చర్యలు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలను ఆధునీకరించి, సుందరీకరణకు చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా, వేంకటేశ్వర చౌరస్తాలలో ఏర్పాటు చేసిన జంక్షన్లను శుక్రవారం కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగానే బెల్లంపల్లి చౌరస్తాలో త్రివిధ దళాల రూపంలో జంక్షన్‌ను అభివృద్ధి చేశామని తెలిపారు. దేశ సైనికులు, నేవీ, నౌకాదళంను తలపించేలా అభివృద్ధి పర్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, డీసీపీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, మేనేజర్ విజయ్‌కుమార్, డీఈ మధుకర్, మెప్మా సిబ్బంది, మాజీ సైనికులు, తదితరులు పాల్గొన్నారు.


బెల్లంపల్లి చౌరస్తా జంక్షన్‌లో త్రివిధ దళాల ప్రతిమ వద్ద కలెక్టర్, అధికారులు

క్లుప్తంగా

రాజా విద్యానికేతన్ రాజిరెడ్డి మృతి


రాజిరెడ్డి (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి బాబుక్యాంపు బస్తీకి చెందిన రాజా విద్యానికేతన్ వ్యవస్థాపకుడు, తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సొల్లేటి రాజిరెడ్డి (63) మృతి చెందాడు. కొంత కాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయాడు. శుక్రవారం మృతదేహాన్ని బెల్లంపల్లిలోని స్వగృహానికి తీసుకువచ్చారు. రేణికుంట్ల ప్రవీణ్‌తోపాటు ఇతర నాయకులు, ఉపాధ్యాయులు రాజిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అతడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజిరెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. రాజిరెడ్డి మృతికి సంతాపంగా శనివారం ప్రైవేట్ పాఠశాలల బంద్ నిర్వహించాలని సంఘ నాయకులు నిర్ణయించారు.

రాజిరెడ్డి మృతికి సంతాపం

శ్రీరాంపూర్: బెల్లంపల్లి పట్టణానికి చెందిన ట్రస్మా నాయకుడు రాజిరెడ్డి మృతిపై అసోసియేషన్ నాయకులు సంతాపం ప్రకటించారు. ట్రస్మా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రపాణి, గౌరవాధ్యక్షుడు బత్తిని దేవన్న, ఏరియా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన మృతి పాఠశాల విద్యారంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ట్రస్మాలో వివిధ పదవులు చేపట్టి అసోసియేషన్ బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు.

29న ఈపీఎఫ్ శిబిరం

మంచిర్యాలటౌన్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కార్యాలయం కరీంనగర్‌కు చెందిన అధికారులు ఈ నెల 29వ తేదీన ఖాతాదారులకు అవసరమైన సేవలందించేందుకు ఒక్కరోజు శిబిరాన్ని ఉమ్మడి జిల్లాలోని ఆయా జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సెల్వ్యక్టర్ తానయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లాకు సంబంధించి దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ మీటింగ్ హాల్‌లో, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ది సిర్పూర్ పేపర్‌మిల్స్ లిమిటెడ్ హెచ్‌ఆర్డీ హాల్, బాయ్స్ హాస్టల్, సిర్పూర్ కాగజ్‌నగర్‌లో, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో, నిర్మల్‌లోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఈ శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో ఈడీఎల్ఐ పథకం, ఈడీఎల్ఐ అర్హత, లబ్ధిదారుల కేవైసీ, ఈపీఎఫ్‌వో సోషల్ మీడియాపై అవగాహన, తదితర సేవలు పొందవచ్చని తెలిపారు. ఖాతాదారులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గల్లీ నుంచి ఢిల్లీకి..


వరలక్ష్మి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని కుమురం వరలక్ష్మి గణతంత్ర వేడుకలకు ఢిల్లీ వెళ్లింది. డిసెంబర్ 24వ తేదీన నాగపూర్‌లో నిర్వహించిన సబ్ జూనియర్ జాతీయ స్థాయి సైకిల్‌పోలో పాల్గొని కాంస్య పతకం సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గఫార్ తెలిపారు. దీంతో ఈమెను గణతంత్ర వేడుకలకు హాజరు కావాలని ఢిల్లీ నుంచి ఆహ్వానం వచ్చినట్లు పేర్కొన్నారు. ఆమె ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొని ప్రశంసాపత్రం అందుకుందని తెలిపారు. విద్యార్థినిని పాఠశాల పీడీ బండ జీవరత్నం, సిబ్బంది సత్యనారాయణ, శోభారాణి అభినందించారు.

ఉత్తమ ఉద్యోగులు వీరే..


కలెక్టర్ బదావత్ సంతోష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి గుర్తింపు లభించింది. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 202 మంది ఉన్నతాధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ బదావత్ సంతోష్ శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.


సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, డీసీపీ | దత్తు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ | రాములు, ఆర్డీవో, మంచిర్యాల | కిష్టయ్య, రవాణాశాఖ | హన్మంతరెడ్డి, సహకార శాఖ | వినీత, కార్మికశాఖ


సత్యనారాయణ, మత్స్యశాఖ | వెంకటరమణ, ఉపాధి కల్పనశాఖ | రాజేశ్వర్, కలెక్టరేట్ ఏవో | నాగరాజు, కేవీకే శాస్త్రవేత్త | తిరుపతి, కేవీకే శాస్త్రవేత్త | కల్పన, డ్యాన్స్ మాస్టర్ | సురేందర్, సహకారశాఖ | రాజశేఖర్, ఏడీఈ | శ్రీనివాస్, ఏవో విద్యుత్‌శాఖ | స్వర్ణలత, ఏవో, ట్రాన్స్‌పోర్టు | శ్రావ్య, కుందారం పీహెచ్‌సీ


సదయ్య, కంప్యూటర్ ఆపరేటర్ | మహేశ్, హోంగార్డు, ట్రాన్స్‌పోర్ట్ | కిషన్‌నాయక్, సూపరింటెండెంట్ | శ్రీనివాస్, ఏవో | కవిత, సీనియర్ అసిస్టెంట్ | వివేకానంద, ఆర్టీఐ | సంపత్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ | నర్సింహాచారి, ఇంటెలిజెన్స్ పీసీ | దిలీప్‌కుమార్, ఇంటెలిజెన్స్ పీసీ | నరేశ్, ఏఎస్సై నీల్వాయి | సంపూర్ణ, స్టాఫ్‌నర్స్, జన్నారం

జాతీయ జెండాకు అగౌరవం


బెజ్జూర్: రాత్రి 7 గంటల వరకూ తీయని జెండా



దండేపల్లి: మధ్యాహ్నమే కిందకు జారిన జెండా

దండేపల్లి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ముత్యంపేట బస్టాండ్ వద్ద ఓ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ జెండా ఎగురవేశారు. జెండా మధ్యాహ్నం వరకే కిందకు జారింది. దీనిని నాయకులెవరూ పట్టించుకోలేదు. ఇది చూసినవారు జాతీయ జెండాను అగౌరవపరిచారని చర్చించుకున్నారు.

బెజ్జూర్ మండల కేంద్రంలో..

బెజ్జూర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డోకె రోజారమణి జాతీయ పతాకాన్ని తలకిందులుగా ఎగురవేశారు. అనంతరం మళ్లీ సరి చేశారు.

బెజ్జూర్ మండలం తాలాయిలో..

బెజ్జూర్ మండలంలోని తాలాయి గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రంలో ఉదయం ఆవిష్కరించిన జాతీయ జెండాలను రాత్రి 7 గంటలు దాటినా తీయలేదు. అధికారుల నిర్లక్ష్యంతోనే జాతీయ జెండాకు అవమానం జరిగిందని పలువురు చర్చించుకున్నారు.


బెజ్జూర్: తలకిందులుగా ఎగరేసిన అనంతరం జెండాను సరిచేస్తున్న దృశ్యం

విలేజ్ ఇన్నోవేషన్ అవార్డు విజేతకు సన్మానం


మక్సూద్‌ను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తాండూర్: మండలంలోని తాండూర్ మండల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న మహ్మద్ మక్సూద్‌ను స్థానిక పంచాయతీ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్, పంచాయతీ రాజ్‌శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న విలేజ్ ఇన్నోవేషన్ అవార్డ్స్–2024 కార్యక్రమంలో భాగంగా మక్సూద్ హోం మేడ్ ప్రొజెక్టర్ తయారుచేసి అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మక్సూద్‌ను శాలువాతో సత్కరించి అవార్డు అందజేశారు. సర్పంచ్ నవీన్, జెడ్పీటీసీ సభ్యుడు బానయ్య, పంచాయతీ కార్యదర్శి తపాస్ తదితరులు పాల్గొన్నారు.

కేకే ఓసీలో బోరు పనుల అడ్డగింత


బోరు పనులు అడ్డుకుంటున్న స్థానికులు

కాసిపేట: మందమర్రి ఏరియా కళ్యాణిఖని ఓపెన్‌కాస్టులో నిర్వాసిత గ్రామం దుబ్బగూడెం గ్రామస్తులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామశివారు ఓసీలో చేపట్టిన బోరు పనులను స్థానికులు అడ్డుకున్నారు. సింగరేణి అధికారులు ఓసీ ప్రారంభానికి ముందు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మాట ఇచ్చి మూడేళ్లుగా తిరుగుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. తమకు ఉపాధి అవకాశాలు కల్పించి న్యాయం చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేసి ఓసీ పనులు అడ్డుకుంటామని చెప్పారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ముజాహిద్ వివరాల ప్రకారం... ఇందిరమ్మ కాలనీ సమీపంలోని సేవాదాస్ నగర్‌కు చెందిన హేరకుమ్ర సాయిపృథ్వీ (24) తన సోదరుడితో నివాసం ఉంటున్నారు. తల్లి తిర్యాణిలో టీచర్‌గా ఉద్యోగం చేస్తోంది. సాయిపృథ్వీ గతంలో ఉక్రెయిన్‌లో ఎంబీబీఎస్ అడ్మిషన్ పొందాడు. అప్పట్లో అక్కడ యుద్ధం కారణంగా ఇంటికి తిరిగి వచ్చాడు. ఎంబీబీఎస్‌లో సీటు రాకపోవడంతో బీఎస్సీలో అడ్మిషన్ తీసుకున్నాడు. అప్పటి నుంచి మనోవేదనకు గురవుతున్న ఆయన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య


మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: మంచిర్యాల నుంచి బల్లార్షా వైపు వెళ్తున్న ఓ రైలు కిందపడి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. 30–35 ఏళ్ల గల వ్యక్తి కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. ఎర్రని, సన్నని గీతలు గల తెల్ల ఫుల్‌షర్ట్, బూడిద కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్ట్

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్‌కు చెందిన సురేశ్‌పై రెండ్రోజుల క్రితం హత్యాయత్నం చేసిన పోల్‌రాజ్‌ను అరెస్ట్ చేసినట్లు మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పచ్చునూరి సురేశ్, తన్నీరు పోల్‌రాజు కూలీ పనికి వెళ్తూ వచ్చిన డబ్బులతో తాగుడుకు బానిసయ్యారు. విద్యానగర్‌లో నూతన నిర్మాణాల్లో తలదాచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత మంగళవారం కూలీ పనులకు వెళ్లి వచ్చాక అర్ధరాత్రి డబ్బుల విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో సురేశ్‌ను పోల్‌రాజ్ ఇటుకతో కొట్టి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న సురేశ్ అక్క స్వర్ణలత ఘటనా స్థలికి వెళ్లి పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని సురేశ్‌ను మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు పంపించారు. స్వర్ణలత ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి పోల్‌రాజ్‌ను అరెస్ట్ చేశారు.

వేటగాడిపై కేసు

వాంకిడి: మండలంలోని బంబార గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత గురువారం బంబార శివారులోని అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహించగా ఓ చేనులో కుందేళ్లు పట్టేందుకు అమర్చిన ఉచ్చు లభించింది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టి ఉచ్చు ఏర్పాటు చేసిన వ్యక్తి బంబార గ్రామానికి చెందిన డోకె సంజీవ్‌గా గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేసి శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వన్యప్రాణులను వేటాడటం నేరమని హెచ్చరించారు. ఎఫ్ఎస్‌వో లక్ష్మణ్, ఎఫ్‌బీవో సుమన్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఎదులాపురం: రోడ్డు ప్రమాదంలో యువకుడు గురువారం రాత్రి మృతిచెందాడు. టూ టౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు వివరాల ప్రకారం... మహారాష్ట్ర నాందేడ్ జిల్లా మాహూర్ తాలుకా అసోలి గ్రామానికి చెందిన రాథోడ్ అమిత్ (22), రాథోడ్ గణేశ్‌లు అదే గ్రామానికి చెందిన రాథోడ్ ప్రఫుల్ ఆటోలో తాంసి మండలం బండల్‌నాగపూర్ గ్రామానికి గురువారం రాత్రి సరుకుల కోసం వచ్చారు. రాత్రి 11గంటల ప్రాంతంలో అసోలికి బయలు దేరారు. జమునానగర్ ప్రాంతంలో ఆటో బోల్తా పడగా అమిత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మాండ్వి ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తీసుకురాగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

మిస్సింగ్ కేసు నమోదు

ఎదులాపురం: ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షాకాలనీకి చెందిన తోక ఊశన్న (35) కనిపించడం లేదని టూ టౌన్ ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. తోక ఊశన్న ఈనెల 19న పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఇంత వరకు తిరిగి రాకపోవడంతో.. కొడుకును వెతికి పెట్టాలని కోరుతూ ఊశన్న తల్లి తోక లసుందేవి ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లక్ష్యాలను చేరుకోవాలి


జెండా ఆవిష్కరిస్తున్న జీఎం సంజీవరెడ్డి


సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

శ్రీరాంపూర్: కంపెనీ నిర్దేశించిన 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని సింగరేణి శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం నస్పూర్ గోదావరి కాలనీలోని ప్రాణహిత స్టేడియంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నైనీ బ్లాక్ లక్ష్యాలు పోను 72 మిలియన్ టన్నులను సాధించాల్సి ఉందని తెలిపారు. శ్రీరాంపూర్‌లో భూగర్భ గనులు 93 శాతం ఉత్పత్తితో నడుస్తున్నాయని పేర్కొన్నారు. కార్మికులకు శుద్ధజలం అందించేందుకు రూ.16 కోట్లతో రాపిడ్ గ్రావిటీ ఫోర్స్ ట్యాంకులు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇటీవల విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఏరియాలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన 18 మంది ఉద్యోగులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, ఎస్వోటూజీఎం రఘుకుమార్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఫైనాన్స్ ఏజీఎం మురళీధర్, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ అధికారులు ఎం.శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, ఏవీ రెడ్డి, రాముడు, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌కుమార్, డీవీ రావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం, గనులపై..

జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అన్ని డిపార్టుమెంట్ల ముఖ్య అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్‌లోని పలు గనులపై ఆయా మేనేజర్లు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

రిపోర్టర్‌పై కేసు.. రిమాండ్

- జర్నలిస్ట్ ముసుగులో బెదిరింపులు
- ఆరుగురు ముఠాగా ఏర్పడి దందాలు

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలక్రైం: ఒంటరి మహిళలు, యువ జంటలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేస్తున్న నేషనల్ క్రైం బ్యూరో రిపోర్టర్‌ను మంచిర్యాల పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఓ జంటను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసిన వైనంపై శుక్రవారం 'ఒంటరి మహిళలు, యువ జంటలే లక్ష్యం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. సదరు విలేకరి కుదురుపాక పోషంను అరెస్టు చేసి విచారణ జరిపారు. విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. పోషం గతంలో ఓ యూట్యూబ్ చానల్‌లో పని చేశాడని, అందులోనూ అక్రమాలకు పాల్పడడంతో తొలగించారని తెలిసింది. అనంతరం మరో కొత్త చానల్ పేరుతో ఐడీ కార్డు వేసుకుని నేషనల్ క్రైం బ్యూరోగా తనతోపాటు మరో ఐదుగురిని వెంటేసుకుని ముఠాగా ఏర్పడ్డారు. కాగజ్‌నగర్‌కు చెందిన నిరంజన్, నస్పూర్‌కు చెందిన సత్యనారాయణ, పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన మహేష్, మంచిర్యాల కాలేజీ రోడ్‌కు చెందిన శ్రీకాంత్, వినోద్ ముఠాగా ఏర్పడి దందాలకు పాల్పడుతున్నారని తేలింది. ఈ నెల 22న మంచిర్యాలలోని కాలేజీరోడ్డులో ఓ యువ జంటను బెదిరించిన వీడియో వైరల్ కావడం, ఆపై డబ్బులు డిమాండ్ చేయడం తెలిసిందే. బాధితులు రూ.40వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించినట్లు 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీంతో పోలీసులు పోషంతోపాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పోషంను రిమాండ్‌కు తరలించగా, త్వరలో మరో ఐదుగురిని రిమాండ్‌కు తరలిస్తామని మంచిర్యాల సీఐ రాజు తెలిపారు.

కనీస మద్దతు ధర చట్టాలు అమలు చేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

పాతమంచిర్యాల: పంటలకు కనీస మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని అఖిల భారత కిసాన్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. రైతులకు కనీస మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయడంలేదని, రుణమాఫీ చేయలేదని, ఉద్యమాల సమయంలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయలేదని, ఉద్యమంలో 750 మంది రైతులు చనిపోగా వారి కుటుంబాలకు ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం నల్ల చట్టాలను పరోక్షంగా అమలు చేస్తోందని ఆరోపించారు. ప్రజావ్యతిరేక విధానాలు వీడి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అఖిల భారత కిసాన్ మజ్దూర్ సంఘ్ నాయకుడు సంకె రవి, ఐఎఫ్‌టీయూ నాయకుడు మేకల రాములు, నాయకులు దొండ ప్రభాకర్, మల్లన్న, రత్నం తిరుపతి, శ్రీకాంత్, సీఐటీయూ నాయకుడు రంజిత్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి

పెంబి: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు చికిత్స పొందుతూ శుక్రవారం పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఎస్సై రజినీకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని తాటిగూడ గ్రామానికి చెందిన గుగ్లావత్ గోవింద్ (42) తనకున్న ఎనిమిది ఎకరా ల్లోని వ్యవసాయ భూమిలో ఐదెకరాల్లో పత్తి, మూడెకరాల్లో నీలగిరి పంటను వేశాడు. వ ర్షాల ప్రభావంతో పత్తి పంట దిగుబడి రాకపోవడంతో పాటు నీలగిరి మొక్కలు చనిపోయా యి. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తె లియక బుధవారం 10గంటల సమయంలో పత్తి చేనులో పురుగుల మందు తాగాడు. తా గిన విషయం ఇంటికి వచ్చి భార్య సునీతకు చె ప్పడంతో నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆ స్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్సై రజినీకాంత్ తెలి పారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.